క్లుప్తంగా

ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

అద్దంకి: ముస్లింలకు వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ముస్లింలు అత్యంత ప్రీతిపాత్రమైన బక్రీద్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని కోరారు. ముస్లింలకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

నిత్యావసరాలను సబ్సిడీ ధరలకే ఇవ్వాలి

చీరాల టౌన్: పేద, మధ్య తరగతి ప్రజలు పెరిగిపోతున్న నిత్యావసర వస్తువులు, సరుకుల ధరలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. పెరిగిపోతున్న ధరలను అదుపుచేయడంతో పాటు సబ్సిడీ ధరలకే సరుకులు అందించాలని ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల సంఘాల సమాఖ్య చైర్మన్ దాసరి ఇమ్మానియేల్, జనరల్ సెక్రటరీ రామకృష్ణలు ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్నిరోజుల నుంచి బియ్యం, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, వంట నూనెలు, చింతపండు, టమోటా, ఇతర నిత్యావసర సరుకులు రేట్లు పెరిగిపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ప్రభుత్వం సబ్సిడీపై సరుకులను వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా అమ్మకాలు చేసి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న ధరలను నియంత్రించేందుకు ధరల నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వాడరేవు పోలేరమ్మతల్లికి పొంగళ్లు చెల్లింపు

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు గ్రామంలో కొలువుదీరిన పోలేరమ్మ అమ్మవారి 13 వార్షికోత్సవ తిరునాళ్లను శనివారం వైభవంగా నిర్వహించగా ఆదివారం పొంగళ్లు, నైవేద్యాల చెల్లింపు చేశారు. తిరునాళ్లను పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాయంత్రం శిడిమాను ఊరేగింపు నిర్వహించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకోగా కమిటీ ఏర్పాట్లు చేశారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత

చీరాల టౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని, వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈపూరుపాలెం పంచాయతీ సెక్రటరీ వెంకటేశ్వరరావు సూచించారు. ఆదివారం ఈపురుపాలెం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని గాంధీ పార్కు కూడలి, సావరపాలెం, 40 ఇండ్లకాలనీ, పద్మనాభునిపేట, సీతారాంపేట, ఇందిరానగర్‌కాలనీ ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. వార్డుల్లో పేరుకుని ఉన్న చెత్తకుప్పలను, చిల్లచెట్లను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. ఈసందర్భంగా పంచాయతీ సెక్రటరీ మాట్లాడుతూ గ్రామంలోని నివాసం ఉంటున్న ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటుగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి పంపిణీ చేసిన డస్ట్‌బిన్లను వినియోగించుకుని తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా నిల్వచేసి కార్మికులకు అందించాలన్నారు. జనావాసాల మధ్య చెత్త కుప్పలను నిల్వ చేయకూడదన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రజలందరు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సెక్రటరీ వెంట పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారు.

సిరుల భూములు

- ఇసుక భూముల్లో సంవత్సరానికి మూడు పంటలు
- జీవనోపాధి పొందుతున్న రైతులు
- వేరుశనగ, మొక్కజొన్న, కాయగూరలు సాగు

వేటపాలెం: ఈ భూమ్మీద ఏది పనికిరానిదంటూ ఉండదు. ఏదో ఒక సందర్భంలో ఉపయోగానికి వస్తుంటుంది. అవే ఒక్కోసారి జీవనోపాధిగా మారుతుంది. చీరాల నియోజకవర్గ పరిధిలోని ఒకప్పుడు ఎందుకూ పనికి రావనుకున్న తీర ప్రాంత ఇసుక భూములు ఇప్పుడు రైతులకు సిరులు కురిపిస్తున్నాయి. ఈభూముల్లో రైతులు సంవత్సరానికి మూడు పంటలు పండిస్తున్నారు. వర్షాకాలంలో వరి సాగు, వేసవి కాలంలో వేరుశనగ, చేమదుంప, మొక్కజొన్న, మిరప, కాయగూరలు పంటలు సాగుచేస్తున్నారు. ఈ భూములకు మూడు ప్రాంతాల్లోని ఎత్తిపోతల పథకాల కింద దాదాపు 8 వేల ఇసుక భూములకు సాగునీరు పుష్కలంగా ఒక పొంటకు సాగు నీరు అందుతుంది. వేసవి కాలంలో ఆరుతడి పంటలుగా ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్ మోటార్లతో బోరుబావుల ద్వారా వేరుశనగ పంటలకు స్ప్రింక్లర్ల సహాయంతో పంట పండిస్తున్నారు. 16 ఏళ్ల కిందట తీరం వెంట ఇసుక భూముల్లో సాగుకు పనికిరాని భూములుగా పేరుందేది. ఆభూముల్లో సరుగుడు, జీడిమామిడి తోటలు పెంచేవారు. వీటిని అప్పటిలో అడవి ప్రాంతాలుగా పిలుచుకునే వారు. అయితే ఎత్తిపోతల పథకాలు


స్ప్రింక్లర్ల సాయంతో సాగవుతున్న వేరుశనగ పంట

ప్రారంభించిన తరు వాతం ఇసుక భూముల్లో ఉన్న సరుగుడు, జీడిమామిడి తోటలను తొలగించి వరి, వేరుశనగ పంటలు సాగుచేస్తున్నారు.

స్ప్రింక్లర్లతో సాగు..

వేటపాలెం మండల పరిధిలో తీరప్రాంతాల వెంట స్ట్రయిట్ కట్‌లపై మూడు ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. అక్కాయిపాలెం ఎత్తిపోతల పథకం, నాయినపల్లి, మోటుపల్లి ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. ఈ మూడు ఎత్తిపోతల పథకాల పరిధిలో 8 వేల ఎకరాల్లో ఇసుక భూముల్లో రైతులు పంటలు పండిస్తున్నారు. పాపాయిపాలెం, అక్కాయిపా లెం, చల్లారెడ్డిపాలెం, కఠారివారిపాలెం, పొట్టిసుబ్బయ్యపాలెం, కొత్తపాలెం, బచ్చులవారిపాలెం, కొత్తరెడ్డిపాలెం, పాతరెడ్డిపాలెం, మోటుపల్లి ప్రాంతాల్లోని భూముల్లో మూడు పంటలు పండిస్తున్నారు. వీటితో పాటు వేసవి కాలంలో ఇసుక భూముల్లో ఆరుతడి పంట అయిన వేరు శనగ, చేమదుంప, మొక్కజొన్న, కాయగూరలు, పంటలు సాగు చేపట్టారు. పంట భూముల్లోనే బోర్లు ఏర్పాటు చేసుకొని మోటర్ల సహాయంతో స్ప్రింక్లర్లతో వేరుశనగ పంట సాగు చేసుకొంటున్నారు. వర్షాకాలంలో ఎత్తిపోతల పథకం ద్వారా వరి పైరు సాగు చేశారు. ఎకరాకు 33 నుంచి 35 బస్తాల వరకు ధాన్యం పండించారు.


ఇసుక భూముల్లో సాగు చేసిన మొక్కజొన్న పంట

భారీగా పెరిగిన తీరప్రాంత భూముల విలువ..

తీరప్రాంతంలో ప్రభుత్వం కోట్లు నిధులతో సముద్రతీర గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించింది. దీనికి తోడు ఎత్తిపోతల పథకాలతో తీర ప్రాంత భూములో మంచి పంటలు సాగు చేగు చేస్తున్నారు. గతంలో ఈ భూములు విలువ రూ. 20 వేలు ఉండేది. ప్రస్తుతం ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ. 30 లక్షల నుంచి రూ.1 కోటి పలుకుతోంది. దీనికి తోడు ఒంగోలు టూ దిగమర్రు జాతీయ రహదారి సముద్ర తీర ప్రాంతం నుంచి వెళ్తుండటంతో ఈ భూములుకు మంచి గిరాకీ ఏర్పాడింది. చీరాల, వేటపాలెం సముద్ర తీరం వెంట భారీగా రిసార్టులు కట్టుడంతో పర్యాటకుల సందడి విపరీతంగా పెరిగిపోయింది. నిత్యం తీరవద్ద సినిమా షూటింగ్‌లతో పాటు బుల్లితెర సీరియల్స్ తీస్తున్నారు.

నేటి నుంచి స్వర్ణమ్మతల్లి తిరునాళ్లు

- వెయ్యేళ్ల చరిత్ర కలిగిన అమ్మవారికి ప్రత్యేక పూజలు

కారంచేడు: గ్రామ దేవత స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు దేవదాయశాఖాధికారులు, గ్రామదేవత స్వర్ణమ్మతల్లి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాన్ని వరదలు ముంచెత్తే సమయంలో తన చీర కొంగును అడ్డుపెట్టి గ్రామాన్ని కాపాడిన స్వర్ణమ్మ తల్లి తిరునాళ్ల సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం నుంచి బుధవారం వరకు ఈ తిరునాళ్లను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. మొదటి రోజు సోమవారం అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పిస్తారు. ప్రతి ఇంటి నుంచి ఆడపడుచుకు పసుపు కుంకుమలు తీసుకురావడం ఇక్కడ ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, శిడిమాను ఉత్సవం, అమ్మవారి ఘటం కుండలు, హరిశ్చంద్ర నాటకం, బొగ్గవరపు నికితచౌదరి, సహస్ర చౌదరిలచే కూచపూడి నృత్యాలు, జానపద నృత్య ప్రదర్శనలు, విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేశారు. బుధవారం అమ్మవారికి పొంగళ్ల సమర్పణతో తిరునాళ్లను ముగిస్తామని దేవదాయ, ధర్మాదాయ శాఖ మేనేజర్ చెన్నారెడ్డి వేణుగోపాలరావు తెలిపారు. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిపినా మొదటగా అమ్మవారికి మొదటి శుభలేఖను అందిస్తారు. గ్రామంలో ఎలాంటి నూతన వాహనాలు కొనుగోలు చేసినా వాహనంపై స్వర్ణమ్మ


ప్రత్యేక అలంకరణలో స్వర్ణమ్మ తల్లి


తిరునాళ్లకు ముస్తాబవుతున్న స్వర్ణమ్మ తల్లి దేవాలయం

తల్లి పేరునే వేయించుకోవడం ఇక్కడ ప్రజలకు భక్తి. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి స్వర్ణమ్మ తల్లి తిరునాళ్లకు అవసరమైన ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అమ్మవారి చరిత్ర..

సుమారు వెయ్యి సంవత్సరాలకుపైగా చరిత్ర కలిగిన అమ్మవారు గ్రామాన్ని, గ్రామ ప్రజలను కాపాడారని చరిత్ర. ఒక రోజు అర్ధరాత్రి అందరూ నిద్రపోతున్న సమయంలో చీరాల వైపు నుంచి వరద స్వర్ణ గ్రామం వైపు ఉరకలేస్తుంది. నిద్రలో ఉన్న గ్రామంపైకి వస్తున్న వరదను స్వర్ణమ్మ తల్లి తన చీర కొంగును అడ్డుపెట్టి వరదకు అడ్డుకట్టవేశారు. తెల్లవారిన తరువాత గ్రామస్తులు లేచి చూచినప్పుడు వరదలు వచ్చిన ఆనవాళ్లు కనిపించాయి. తమను, తమ గ్రామాన్ని వరద భారీ నుంచి రక్షించి, తమ ప్రాణాలు కాపాడిన స్వర్ణమ్మను గ్రామ దేవతగా పూజించడం మొదలు పెట్టారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారికి ప్రతి ఏటా తిరునాళ్లు నిర్వహించి భక్తులు తమ మొక్కుబడులు తీర్చుకుంటుంటారు. గ్రామానికి చెందిన ప్రజలు ఎక్కడ ఏ పనుల్లో ఉన్నా తిరునాళ్లకు తప్పకుండా గ్రామానికి వచ్చి అమ్మవారిని దర్శించుకుంటుంటారు. గ్రామ ఆడపడుచులు ఎక్కడ నివాసాలున్నా తిరునాళ్లకు గ్రామానికి చేరుకుంటారు.

బక్రీద్ వేడుకలకు ముస్తాబు

బల్లికురవ: బక్రీదు వేడుకలు సోమవారం నిర్వహించేందుకు మండలంలోని మసీదులు, దర్గాలను ప్రత్యేకంగా అలంకరించారు. బల్లికురవ, వల్లాపల్లి, వైదన కొప్పరపాడు, చెన్నుపల్లి, కోటావారిపాలెం, కొణిదెన గ్రామాల్లోని మసీదులు ఈద్గాలు ముస్తాబుతో సోమవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు ముజావర్ల ఆధ్వర్యంలో సమాయత్తం అవుతున్నారు.

రామలింగేశ్వరుడికి అభిషేకం


అలంకరణలో రామలింగేశ్వరుడు


అలంకరణలో బాల త్రిపురసుందరీదేవి

బల్లికురవ: మండలంలోని కొనిదెన గ్రామంలోని బాలత్రిపుర సుందరీ సమేత రామలింగేశ్వరుడికి ఆదివారం అభిషేకాలు, అలంకరణ చేపట్టారు. జేష్టమాసం శుక్లపక్షం దశమి సందర్భంగా అర్చకులు గూడూరి మోహనశర్మచే ఆలయంలోని గణపతికి అభిషేకం, రామలింగేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం అలంకరణ చేపట్టారు. బాలా త్రిపుర సుందరీ దేవికి కుంకుమ పూజ కార్యక్రమంలో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొన్నారు.

నేడు చినఅంబడిపూడి ఆలయ వార్షికోత్సవం


విద్యుత్ దీపాల అలంకరణలో చిన అంబడిపూడి శివాలయం

బల్లికురవ: మండలంలోని చిన అంబడిపూడి గ్రామంలోని గంగాపార్వతి సమేత మల్లేశ్వరస్వామి 8 వవార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త గంగవరపు వెంకటేశ్వర్లు ఆదివారం తెలిపారు. అర్చకులు పేటేటి లక్ష్మీ వరప్రసాదరావుచే ఉదయం మల్లేశ్వరస్వామికి మహన్యాసపూర్వక ఏకవార రుద్రాభిషేకం, అన్నాభిషేకం, శివపార్వతుల కల్యాణం, వారం రోజులుగా శివనామ సంకీర్తన సప్తాహం నిర్వహిస్తున్నారు. ప్రత్యేక అలంకరణ అమ్మవారికి కుంకుమ పూజలు, ఆలయంలోని గణపతి ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు చెప్పారు. వేడుకల్లో భాగంగా ఉదయం 11 గంటల నుంచి అన్నసంతర్పణ చేపడుతున్నామని ఈ వేడకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ధర్మకర్త కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు కంటి వైద్యపరీక్షలు

చీరాల అర్బన్: చీరాల ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆదివారం కంటి వైద్యపరీక్షలు నిర్వహించామని ఆర్టీసీ డిపో మేనేజర్ జంజనం శ్యామల తెలిపారు. స్మార్ట్ విజన్ ఐ హాస్పిటల్, ఒంగోలు వారిచే ఆదివారం బస్టాండ్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. కంటి వైద్యనిపుణులు డాక్టర్ బి.నాగమాధురిచే కంప్యూటరైజ్డ్ పరికరాలతో కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో 75 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. వీరిలో కొంత మందికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది పాల్గొన్నారు.


కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చీరాల రోటరీ క్లబ్‌కు అవార్డులు


రోటరీ గవర్నర్ చేతుల మీదగా అవార్డులందుకున్న క్లబ్ ప్రతినిధులు

చీరాల అర్బన్: ఉత్తమ సేవలందించిన రోటరీ క్లబ్ చీరాలకు మూడు అవార్డులు లభించాయని అధ్యక్షులు మామిడాల శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. ఆదివారం భద్రాచలంలో జరిగిన రోటరీ డిస్ట్రిక్ట్ 3150 కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది నిర్వహించిన సేవా కార్యక్రమాలకు ఉత్తమ ప్రెసిడెంట్ అవార్డును మామిడాల శ్రీనివాసరావుకు, ఉత్తమ సెక్రటరీ అవార్డును చీరాల కృష్ణమూర్తి అందుకున్నారు. అలానే గత ఏడాది డిసెంబర్‌లో రామాపురం బీచ్ పెరల్ రిసార్ట్స్ నందు నిర్వహించిన జిల్లా స్థాయి సాగర తీర క్రీడా మహోత్సవానికి స్పెషల్ అవార్డును రోటరీ 3150 జిల్లా గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. అలానే నాలుగు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందుకున్నారు. రోటరీ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహించాలని క్లబ్ సభ్యులను గవర్నర్ కోరారు. కార్యక్రమంలో దోగుపర్తి వెంకట సురేష్, వలివేటి మురళీకృష్ణ, జీవై ప్రసాద్, డాక్టర్ ఇస్తర్ల బాబూరావు, పోలుదాసు రామకృష్ణ పాల్గొన్నారు.

బడి కాలం.. కోలాహలం

- సందడిగా మారిన బ్యాగుల దుకాణాలు
- బ్యాగుల దుకాణాల వద్ద బారులు తీరిన విద్యార్థులు
- అందుబాటులో బ్యాగుల ధరలు

చీరాల రూరల్: బ్యాగుల దుకాణాలు సందడిగా మారాయి. స్కూళ్లు, కాలేజీలు తెరచుకోవడంతో బ్యాగులు కొనుగోలు చేయడం కోసం విద్యార్థులు వారి తల్లిదండ్రులు బ్యాగుల దుకాణాల ముందు క్యూ కడుతున్నారు. నెల రోజలకుపైగా విరామం తరువాత స్కూళ్లు, కాలేజీలు ఈనెల 13 నుంచి తెరచుకున్నాయి. అయితే విద్యార్థిని, విద్యార్థులు తమ పాత బ్యాగులకు టాటా చెప్పి కొత్త బ్యాగులు కొనుగోలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారు. అయితే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కొత్త విద్యా సంవత్సరంలో అన్నీ కొత్తగా ఉండాలని భావించి బ్యాగు కొద్దిగా పాతబడినా సరే తమ పిల్లలు అందరి పిల్లల్లో పలచన కాకూడదనే భావనతో కొత్త పుస్తకాలతో పాటు కొత్త బ్యాగులు, లంచ్ బ్యాగులు కొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నారు. ఆ కోవలోనే ఎంత ధర వెచ్చించి అయినా సరే కొత్తగా బ్యాగులు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అయితే బ్యాగులతో పాటు పుస్తకాలు, బూట్లు అన్నీ ఉచితంగా అందిస్తున్నారు.

చీరాలలో 12 దుకాణాలకుపైగా..

చీరాల పట్టణంలోని బెస్తపాలెం బ్యాగుల తయారీకి కేంద్రంగా మారింది. ఈ ప్రాంతంలో 12కు పైగా బ్యాగులు తయారీ కేంద్రాలు ఉన్నాయి. అలానే సంఘం థియేటర్ సెంటర్, ముంతావారి సెంటర్ ప్రాంతాల్లో కూడా దుకాణాలున్నాయి. ఆయా దుకాణదారులే హోల్‌సేల్‌గానే కాకుండా రిటైల్‌గా విక్రయాలు చేస్తున్నారు. విజయవాడ, హైదరాబాద్ వంటి నగరాల్లో ముడి సరుకులు తెచ్చుకుని బ్యాగులు తయారు చేస్తున్నారు. రెడీమెడ్ బ్యాగులను విజయవాడలో తక్కువ ధరలకు కొనుగోలుచేసి జనాలకు అందుబాటు ధరలలో విక్రయిస్తున్నారు. ఒకటి నుంచి ఐదు తరగతులు చదివే విద్యార్థులకు రూ. 300, ఐదు నుంచి 10 తరగతులు, ఆపై కాలేజీలలో చదివే విద్యార్థులకు రూ. 500 ధరలు నిర్దేశించి విక్రయాలు చేస్తున్నారు. ఈ బ్యాగులే కాకుండా లేడీస్ హ్యాండ్ బ్యాగులు, ట్రావెలింగ్ బ్యాగులు, ఇతర దేశాలకు వెళ్లేందుకు వీలుగా ఉండే తేలికపాటి ట్రావెలింగ్ బ్యాగులను తయారు చేస్తున్నారు.


రకరకాల బ్యాగులతో నిండిన బెస్తపాలెంలోని బ్యాగుల తయారీ దుకాణం

అందుబాటులో ధరలు..

పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో బ్యాగుల ధరలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితులలో పిల్లలకు కొత్త బ్యాగులు కొనుగోలు చేయడం తప్పడం లేదు. పాత బ్యాగులు పిల్లలు వద్దంటున్నారు. అయినా సరే పిల్లల అభిరుచి మేరకు కొత్త బ్యాగులు కొనుగోలు చేయక తప్పడం లేదు.

– శ్రీనివాసరావు, కొనుగోలుదారుడు.



వ్యాపారాలు బాగా ఉన్నాయి..



స్కూళ్లు, కాలేజీలు తెరచుకోవడంతో వ్యాపారాలు బాగా ఉన్నాయి. ఏడాదంతా ఎంతో కష్టపడి తయారు చేసిన బ్యాగులు స్కూళ్లు, కాలేజీలు తెరచిన పదిరోజుల్లోపు అమ్ముడుపోతాయి. విద్యార్థుల డిమాండుకు తగ్గట్లుగా ప్రతి ఏడాది బ్యాగులు తయారు చేస్తాం.

– విష్ణు, దుకాణ యజమాని

అందుబాటు ధరలలో విక్రయిస్తాం..



స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులకు అందుబాటు ధరలలో బ్యాగులు అందిస్తున్నాం. రూ. 300 నుంచి రూ. 500 వరకు మాత్రమే రుసుము వసూలు చేస్తున్నాం. దానివలన కొనుగోలుదారులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– రామాంజనేయులు, దుకాణ యజమాని

పుస్తక పఠనంతో విజ్ఞానం


విద్యార్థులతో లైబ్రేరియన్

అద్దంకి రూరల్: పుస్తకాలు చదవటం వల్లే విజ్ఞానం పెంపొందించుకొవచ్చని సంతమాగులూరు శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ బాదం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. ఆదివారం సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు చదవటం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులచే నీతి కథలు, వివిధ రకాల పుస్తకాలను చదివించారు. కార్యక్రమంలో 16 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయనం, జ్యేష్టమాసం, స్వాతి నక్షత్రం, ఏకాదశి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

మట్టి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మట్టిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా కొట్టిన ఘటన ఆదివారం మండలంలోని ఏల్చూరు గ్రామంలో చోటు చేసుకుంది. అందిన వివరాల మేరకు.. మండలంలోని ఏల్చూరు గ్రామంలో మట్టి తరలిస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ క్రమంలో ట్రాక్టర్ డ్రైవర్ పక్కకు దూకటంతో ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానికుల సహాయంతో ట్రాక్టర్‌ను పైకి లేపారు.